# ప్రత్యేక దినం

**శం**కర్రావు పరిస్థితి దయనీయంగా వుంది.

అర్ధరాత్రి పన్నెండు దాటింది. అయినా కంటిమీద కునుకు రావడం లేదు. కూతురు, కొడుకు ఇచ్చిన వార్నింగ్ గుర్తొచ్చి గుండె గొంతులోకి వచ్చేస్తోంది.

చిన్నతనంలో ఏదైనా పొరబాటు చేస్తే మా నాన్న తాట వలుస్తాడని భయపడి చచ్చిపోయేవాళ్ళం. ఇప్పుడు మేము ఏ పొరబాటూ చెయ్యకుండానే ఈ పిల్లలకి భయపడి ఛస్తున్నాం.

'ఛ. వెధవ బతుకు' అనుకున్నాడు అరవై అరోసారి. అంతలో భార్య శ్యామల వచ్చి లైటువేసింది.

"ఎందుకలా కాలుగాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నారు?" అని అడిగింది. తనని వేధిస్తున్న సమస్యని భార్యతో చెప్పాడు.

అంతావిని "హవ్వ! ఎవరైనా వింటే నవ్విపోతారు. మారుతున్న కాలంతో బాటు మనమూ మారాలిగా. ఏ రాతియుగంలోనో వుండిపోతాం అంటే ఎట్లా? నలుగుర్నీ చూసి నేర్చుకోండని చెవిన ఇల్లు కట్టుకుని పోరతాను. మీకు తలకి ఎక్కితేనా? ఒక సరదా లేదు. ఒక ముచ్చటా లేదు. హాయిగా సరదాగా వేడుకలు జరుపుకోకుండా అన్నింటికి ఏడుపు మొహం వేస్తారేం? ఇక చాలుగానీ వచ్చిపడుకోండి. పిల్లల ఎదుటకూడా ఇలా తిరిగితే వాళ్ళు మనసు కష్ట పెట్టుకుంటారు. వాళ్ళేం కాని కోరికలు కోరారా? మీరింత రాద్ధాంతం చెయ్యడానికి. నలుగురితో నారాయణ... అంతేగా" అని నాలుగు చీవాట్లు వేసింది.

శంకర్రావు మనసు మరింత చిన్నబోయింది.

ఎదురు తిరిగి దెబ్బలాడదామనుకున్నాడు. అలాచేస్తే సమస్య తీరిపోదు సరి కదా. మరింత జటిలం అయిపోతుంది. మాటామాటా పెరుగుతుంది. పిల్లలు లేస్తారు. ముగ్గురూ కలిసి తనకు క్లాసు పీకుతారు. ఆ సోది భరించేకంటే నోరు మూసుకుని వూరు కోవటం మంచింది.

అందుకే మాట్లాడకుండా వెళ్ళి పడుకున్నాడు 'ఏవిటో దిక్కుమాలిన రోజులొచ్చిపడ్డాయి' అనుకున్నాడు దీనంగా కళ్ళుమూసుకుని.

శంకర్రావు చాలా మామూలు మనిషి.

సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రజల ఆర్థిక స్థితిలో అనేకానేక మార్పులు. డబ్బేం చేసుకోవాలో తెలియని ఆగర్భశ్రీ మంతులను, కూటికి గతిలేని పేదవాళ్ళను తీసి పక్కన పెడితే, మిగిలిన మధ్యతరగతి వారిలో మూడురకాల వాళ్ళున్నారు.

సక్రమంగా వచ్చే సంపాదన వంద అయితే, అక్రమంగా వెయ్యి అన్నట్లు లంచాలు మెక్కుతూ ఐశ్వర్యం అంతా బాహాటంగా ఖర్చుపెట్టుకుని ఘనంగా బతికేవాళ్ళు ఒకరకం.

ఐటి పుణ్యమా అని నెలతిరిగే సరికి వేలకి వేలు సంపాదన, భార్యా భర్తలిద్దరి జీతాలూ కలిసి చేతినిండా డబ్బు. రేపటి సంగతి రేపు చూద్దాం. ఇవ్వాల్టి రోజున హాయిగా ఎంజాయ్ చేద్దాం అనుకునే ఉద్యోగులు రెండోరకం.

అటు పైసంపాదన లేక, ఇటు కాసులుకురిసే ఉద్యోగాలూ కాక, నెలకింత అని నికరమైన సంపాదన కలవాళ్ళు మూడోరకం.

ఆ మూడోరకానికి చెందినవాడు శంకర్రావు. భార్య శ్యామల గృహిణి. కొడుకు ప్రణవ్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం. కూతురు హరిత డిగ్రీ ఫస్టియర్.

అందరూ మంచివాళ్ళే. కాకపోతే కాలానుగుణంగా నడుద్దాం అంటారు. అలా నడవడం చేతకాక బోర్లా పడిపోతున్నాడు శంకర్రావు.

చిన్నతనం నుంచి శంకర్రావు ముందుచూపుంది. అతన్నలా పెంచాడు తండ్రి. ఉద్యోగంలో చేరాక ఓ రెండేళ్ళు ఆగి, ఆర్థికంగా నాలుగు రాళ్ళు కూడబెట్టుకున్న తర్వాతనే పెళ్ళి చేసుకున్నాడు.

పిల్లలు పుట్టాక వాళ్ళ కోసం నెలనెలా పోస్టాఫీసులో డబ్బు జమ చేశాడు. 'బాగానే గడుస్తుంది జీవితం' అని ఆనంద పడ్డాడు. పిల్లలు ఎదిగారు.

ఈ రోజుల్లో ఇద్దరు పిల్లలని పెంచడం అంటే రెండు ఏనుగులని పెంచడంతో సమానం. వాళ్ళకి తాళం వేస్తూ భార్య.

కొడిక్కి ఇంజనీరింగ్ కాలేజీలో పేమెంట్ సీట్ వచ్చింది. కాలేజీకి వెళ్లడానికి బైక్ కావల్సివచ్చింది. బస్‌లో వెళ్ళరా అంటే–

"ఏమిటి నాన్నా నువ్వు మరీనూ. మా ఫ్రెండ్స్ అందరూ ఇంపోర్టెడ్ బైక్‌లూ, కార్లూ వేసుకొని తిరుగుతూవుంటే నేను బస్సులో వెళ్ళనా?

"అయినా నేనేం సాంట్రో అడిగానా, ఇండికా అడిగానా? ఆఫ్టాల్ యమహా బైక్ కొనమంటే ఏడుస్తున్నావ్" అని సాధించాడు.

"ఏక మొత్తంగా ఇవ్వక్కర్లేదు. ఇన్‌స్టాల్‌మెంట్లో కొనండి" అని సలహా ఇచ్చింది ఇల్లాలు.

"అన్నయ్యకెలాగూ కొంటున్నారు కదా! నాకూ స్కూటీ కొనండి" అని కూర్చుంది కూతురు.

వాహనాలు కొనిస్తే సరిపోయిందా? కాళ్ళకి జోళ్ళు, కళ్ళకి జోళ్ళు, జీన్స్, టీషర్టులు... అన్నీ బ్రాండెడ్‌వే కావాలి. మామూలువి పనికిరావు. చీప్‌గా వుంటుంది.

తెల్లవారి లేస్తే వెహికల్స్‌కి పెట్రోల్ ఖర్చు పిల్లలకి తిండి ఖర్చు.

డబ్బాలో పెరుగన్నం కలిపి, ఓ అవకాయ ముక్కవేసి ఇస్తే తీసికెళ్ళి తినే రోజులు కావు ఇవి. పిజ్జాలు, బర్గర్లు, కేక్‌లు, పేస్ట్రీలు వగైరాలు కావాలి.

ఇద్దరికీ చెరో పచ్చ కాయితం ఇస్తేగానీ గుమ్మం దిగరు.

రోజువారి ఖర్చులకు తట్టుకోలేకనే సతమతం అవుతూ వుంటే, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు పండుగలూ, పర్వదినాలూ.

అసలు మన తెలుగువాళ్ళకు పండుగలు ఎక్కువే.

సంక్రాంతి, ఉగాది, వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి, దసరా, దీపావళి, మొదలైన పాత పండుగలు. రాఖీ, హోళీ, వంటి కొత్త పండుగలు.

పుట్టినరోజులు, పెళ్ళిరోజులు–వెరసి ప్రతినెలా ఏదో పండుగ ఆర్భాటం.

కిందటి ఏడాది వాళ్ళపెళ్ళయి పాతికేళ్ళయిన శుభసందర్భంలో 'ఘనంగా పంక్షన్ చేద్దా'మంది శ్యామల.

"ఎందుకూ? 'మీకిచ్చి చేసి నాన్న నా గొంతుకోశాడని ఆనాటినుంచి ఈనాటి దాకా నువ్వేడుస్తున్నావ్'. హాయిగా ఒంటరిగా వుండకుండా ఈ సంసార సాగరంలో మునిగి పోయాను అని నేనేడుస్తున్నాను. ఇంతటి భాగ్యానికి సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ కూడానూ" అని విసుక్కున్నాడు.

"ఇది మరీ బావుంది. ఫంక్షన్ చేసుకున్న వాళ్ళందరూ అన్యోన్యంగా వుంటున్నారా? దేని దారి దానిదే. ఇవ్వాళా రేపూ అందరూ చేసుకుంటున్నారు సిల్వర్ జూబ్లీ. మనం చేసుకోకపోతే అందరూ ఆక్షేపిస్తారు" అని చెప్పి 'ఫంక్షన్ చేస్తావా చస్తావా' అని పీకలమీద కూర్చుని మరీ చేయించింది.

ఫంక్షన్ గ్రాండ్‌గా జరిగింది. అరవై వేలు ఖర్చయింది. ఆ రాత్రి దగ్గరి బంధువులూ, స్నేహితులూ చేరి గది అలంకరించి వీళ్ళిద్దర్నీ గదిలోకి పంపించి ఆ ముచ్చట కూడా తీర్చేశారు.

పెళ్ళికూతురు ఉత్సాహంగానే వుందిగానీ, అయిన ఖర్చు తల్చుకుని పెళ్ళికొడుకు మాత్రం నీరసపడిపోయాడు.

ఏదో విధంగా బండి లాక్కొద్దామంటే హఠాత్తుగా మరికొన్ని వేడుకలు వచ్చి మీద పడ్డాయి.

వేలంటైన్స్ డే, ఫ్రెండిషిప్ డే,  మదర్స్ డే, ఫాదర్స్ డే... ఎన్నెన్నో కొత్త పద్ధతులు. ఆచారాలు వచ్చిపడ్డాయి.

వేలంటైన్స్ డేకి వాళ్ళిద్దరికీ కోరినంత ఇచ్చి పంపించేసరికి తల బొప్పికట్టింది. 'మదర్స్ డే అమ్మకి ఏదైనా గిఫ్ట్ ఇస్తాం' అని ఇండెంటు పెట్టారు పిల్లలు.

"ఆ ఒక్కరోజయినా మీ అమ్మని విసిగించకుండా అది చెప్పింది విని, పెట్టింది తిని బుద్ధిగా వుండండి. అదే మంచి బహుమానం మీ అమ్మకి" అన్నాడు శంకర్రావు.

"లాభ్ వీల్లేదు. మా ఫ్రెండ్సందరూ బ్రహ్మాండంగా చేస్తున్నారు మదర్స్‌డే మేమూరుకుంటే బావుండదు" అని పంతం పట్టి డబ్బు వసూలు చేశారు.

శ్యామల కోసం వెయ్యిరూపాయలు పెట్టి మంచి మేకప్‌సెట్ కొనుక్కొచ్చారు. 'భలే బావుంది భలే బావుంది' అని మెచ్చుకుని బీరువాలో భద్రపరిచింది శ్యామల. శంకర్రావు ప్రాణం వుసూరుమంది.

స్నానానికి ముందు కాస్తంత పసుపు పూసుకుని స్నానం చేసిన తరువాత మొహానికి కాస్త పౌడరు రాసుకోడం మాత్రం అలవాటు శ్యామలకి. అటువంటి మనిషి మూతికీ బుగ్గలకూ కళ్ళకూ పూసుకునే రంగులు ఏం చేసుకుంటుంది?

పోనీ ఆ ఇచ్చే బహుమతి ఏదో పుచ్చుకునే వ్యక్తిని తీసికెళ్ళి నచ్చింది కొని పెడితే భేషుగ్గా వుంటుంది.

కానీ అలా చెయ్యడం ఔట్ ఆఫ్ ఫ్యాషన్. సర్‌ప్రయిజ్ చెయ్యాలి. ఆ బహుమతి పనికొచ్చేదా పారేసేదా, పుచ్చుకునే వాళ్ల అదృష్టం మీద ఆధారపడి వుంటుంది.

ఆ తర్వాత కూడా బీరువా తీసినప్పుడల్లా వ్యర్థంగా పడివున్న ఆ మేకప్ కిట్‌ని చూస్తే మనసు కలుక్కుమనేది శంకర్రావుకి.

'ఉత్తి పుణ్యానికి వెయ్యిరూపాయలు తగలేశారు. ఆ డబ్బులుంటే నెలరోజులు కూరలకి సరిపోయేది' అనుకునేవాడు బాధగా.

ఏదో పళ్ళ బిగువున రోజులు లాక్కొస్తూ వుంటే హఠాత్తుగా పిల్లలిద్దరూ "నాన్నా ఏం చేస్తున్నారూ?" అంటూ చెరో పక్కనా వచ్చి కూర్చున్నారు.

శంకర్రావు గుండె తార్ మంది వాళ్ళలా ప్రేమగా మాట్లాడారంటే తీరప్రాంతంలో ప్రమాద హెచ్చరిక ఎగరేసినట్లే.

తుఫాను రాబోతోందని అర్థం.

"ఏమిటో చెప్పండి" అన్నాడు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని.

ఫాదర్స్‌డే వస్తోందిట. నీకో మంచి గిఫ్ట్ ఇస్తాం. డబ్బులివ్వమన్నారు.

నవ్వొచ్చింది శంకర్రావుకి "మీ మొహం! నా డబ్బుతో నాకు గిఫ్ట్ ఎందుకు? మీ అభిమానం చాలు నాకు. మీరు సంపాదనాపరులయ్యాక నాకు చెయ్యండి" అన్నాడు నవ్వుతూ.

వాళ్ళూ నవ్వేశారు "భలేవాడివి నాన్నా మేము సంపాదించేసరికి మాకు వేరే ఖర్చులుండవా? అప్పుడిలాంటి దండగ ఖర్చులెవరు భరిస్తారు? అందుకే ఇప్పుడే చేసేస్తాం ఫాదర్స్‌డే" అన్నారు.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు శంకర్రావుకి.

"ఓ అరడజను అరటిపళ్ళుకొనివ్వండి. మా రోజుల్లో టీచర్స్‌డేకి మేము అలానే ఇచ్చేవాళ్ళం" అన్నాడు శంకర్రావు ఆశగా.

"ఛీ ఏమిటి నాన్నా ఎప్పుడు చూసినా చీప్‌గా ఆలోచిస్తావేం?" అంది కూతురు.

"పోనీ కిందటినెలలో మీ అమ్మ అదేదో సేల్‌లో కొన్న షర్టు నేనింకా వాడలేదు. అది ఇవ్వండి గిఫ్ట్‌గా" మరో ఉపాయం సూచించాడు శంకర్రావు.

"ఇంకానయం నువ్వు రెండేళ్ళుగా వాడుతున్న బూట్లు ఇమ్మన్నావుకాదు. కాస్త దర్జాగా ఆలోచించునాన్నా" అన్నాడు కొడుకు.

"అయితే ఏం చెయ్యమంటారు?" అన్నాడు విసుగ్గా.

"ఓ వెయ్యి రూపాయలు ఇవ్వండి మిగతా విషయాలు మా కొదిలెయ్యండి" అనేశారు. "సరే నాకు రెండ్రోజులు టైమివ్వండి" అన్నాడు శంకర్రావు.

మర్నాడు ఆఫీసులో లంచ్ టైంలో ఆ విషయం డిస్కషన్‌కి వచ్చింది. ఇలాంటి పిచ్చి తండ్రులు చాలామందే వున్నారు.

"ఏం చేస్తాం. ఈ ఫారిన్ కల్చరొకటి దిగబడిపోయింది. తట్టుకోలేక పోతున్నాం" అన్నాడొకాయన.

"సిరి అంటదుగానీ చీడ అంటుతుంది అన్నట్లు బుద్ధి తెలిసిన దగ్గర్నుంచి కష్టపడి పనిచేస్తారు ఫారెన్‌లో పిల్లలు. మనవాళ్ళేమో పాతికేళ్ళయినా నాన్నమీదే ఆధారపడి వుంటారు. మన ప్రాణాలు తియ్యడానికి కాకపోతే మనకెందుకండీ ఈ డేలు" అన్నాడు ఇంకో ఆయన.

"ఈ ఇంగ్లీషు పర్వదినాలు కాదుగానండి, మన చావుకొచ్చింది. కిందటి ఏడు మదర్స్‌డేకి మా అమ్మాయి వాళ్ళమ్మకి సెల్‌ఫోన్ కొంటానని నా పీకమీద కత్తిపెట్టి మరీ కొనిపించింది. ఆ వేళ అమ్మకిచ్చి మర్నాటినించి తను వాడుతోంది. ఫ్రెండ్స్‌తో గంటలతరబడి హస్కు ఆ బిల్లు కట్టలేక నా తలవాచిపోతోంది. అంతటితో ఆగితే పర్వాలేదు. ఫాదర్స్‌డేకి నాకు స్కేటింగ్ చేసే షూ బహుమతిగా ఇచ్చారు. ఈ వయసులో ఆ చక్రాల పాదరక్షలు నేనేం చేసుకుందును చెప్పండి? అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు ఇంకో ప్రబుద్ధుడు.

కాసేపు అందరూ తమ బాధలు వెళ్ళబోసుకున్నారు.

"నా వల్లకాదు నేనివ్వనని చెప్పేస్తాను" అన్నాడు శంకర్రావు.

"చెప్పచ్చనుకోండి. ఈ కాలం పిల్లలు ఎంతకైనా తెగించగలరు. వాళ్ళడిగింది ఇవ్వకపోతే చెప్పాపెట్టకుండా పారిపోతే! మళ్ళీ మనకే తలనొప్పి. ఆ మధ్య మావాళ్ళ

అబ్బాయి ఒకడు ఇలానే నాన్న డబ్బులడిగితే ఇవ్వలేదని అలిగి రైలుకిందపడతానని ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయాడట. వీళ్ళు పోలీసు రిపోర్టు ఇచ్చి రైలుపట్టాలన్నీ గాలించి నానాహైరానా పడ్డారు. ఆ కుర్రాడేమో ఓ వారం అక్కడా ఇక్కడా తిరిగి ఇంటికొచ్చాడు. ఇంట్లోవాళ్ళంతా చచ్చి సతమతం అయ్యారు. ఆ గొడవంతా భరించడం కంటే వాళ్ళడిగింది ఇచ్చి దండం పెడితే సుఖం" అన్నాడు ఒక పెద్దమనిషి.

"నిజమేనండి. ఈ కాలం పిల్లలు తెలివిమీరిపోయారు. మావాడు, వాడు అడిగింది ఇవ్వకపోతే 'అంతచేతగాని వాళ్ళు నన్నెందుకు కన్నారు. నన్ను పుట్టించమని నేను అడిగానా? మీ ఆనందం కోసం నన్ను ఈ లోకంలోకి తీసుకొచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తే ఎట్లా?' అని మాట్లాడతాడు. సిగ్గుతో నా ప్రాణం చచ్చిపోతుంది" అన్నాడు ఒక బడుగు ప్రాణి.

"నిజమే ఈ మధ్య సినిమాల్లో హీరోలందరూ నాన్నలని ఈ మాటే అడుగుతున్నారుగా. అలా అడగడం ఇప్పుడు ఫేషను" అన్నాడొకాయన.

చివరికి వాళ్ళడిగింది ఇవ్వడమే సుఖం అని నిర్ణయానికి వచ్చారు అందరూ. సేవింగ్స్‌లోనించి వెయ్యిరూపాయలు తెచ్చి పిల్లలకి ఇచ్చాడు శంకర్రావు.

ఫాదర్స్‌డే రానేవచ్చింది. పిల్లలిద్దరూ ముక్తకంఠంతో "హేపీ ఫాదర్స్‌డే" అని పాట పాడారు ఒక గిఫ్ట్ పేక్ అందచేశారు. 'విప్పి చూడండి' అన్నారు.

మెల్లిగా విప్పిచూశాడు శంకర్రావు. ఒక షర్టు. కూలింగ్ గ్లాసెస్ వున్నాయందులో. షర్టునిండా ఎద్దంత ప్రింటు. ఆ కళ్ళజోడేమో పంచ రంగుల్లో వుంది. అవి రెండూ ధరించి వీధిలోకి వెళ్తే కుక్కలు వెంటపడడం ఖాయం.

లోలోపల కడుపుమండిపోతున్నా పైకి నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు. "చాలా థాంక్స్" అన్నాడు దుఃఖం ఆపుకుంటూ.

ఆ పేకెట్టు ఆపళంగా తీసుకెళ్ళి బీరువాలో పెట్టేశాడు. ఫాదర్స్‌డే అని రాత్రి డిన్నరు బయటికి వెళ్దాం అన్నారు పిల్లలు.

అంతటితో వూరుకున్నా బావుండు. ఆ షర్టేసుకుని కళ్ళజోడు పెట్టుకోమని బలవంతం కూడా చేశారు. శ్యామల కూడా బలవంతం పెట్టింది. 'పిల్లలు సరదా పడుతున్నారు' అని వంతపాడింది.

చివరకు తప్పలేదు శంకర్రావుకి. ఆ అవతారంతో బయటికొచ్చిన శంకర్రావుని చూసి అందరూ మొహంచాటు చేసుకుని నవ్వుకున్నారు. ఆ బాధకి భోజనం కూడా

సరిగ్గా చెయ్యలేదు అతగాడు. వెయ్యి బిల్ చెల్లించి ఫాదర్స్‌డే మహోత్సవం ముగించాడు ఆ బడుగు జీవి.

ఆ రాత్రంతా అతనికి నిద్రలేదు. తెల్లవారుజామున కునుకు పట్టింది. ముందు ముందు ఇంకా ఎన్నో డేలువచ్చేస్తాయి. అత్తగారి డే, మామగారి డే, బావమదిరి డే, భార్య డే, సన్స్ డే, డాటర్స్ డే, నైబర్స్ డే... ఇలా ఎన్నో దినాలు.

ఇవన్నీ సెలబ్రేట్ చెయ్యలేక, తను చిక్కిశల్యమైపోయి, చింకిపాతలతో క్రాస్‌రోడ్స్ దగ్గర సిగ్నల్ పడినప్పుడు అడుక్కు తింటున్నట్లు కల వచ్చింది. కెవ్వున కేకేసి లేచి కూర్చున్నాడు శంకర్రావు.

*విపుల మాసపత్రిక, ఫిబ్రవరి 2008*